క్లుప్తంగా

ఈరన్నస్వామి ఆలయంలో భక్తుల సందడి


స్వామికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

కౌతాళం: ఉరుకుంద ఈరన్నస్వామి దర్శనానికి సోమవారం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. దీంతో క్షేత్రం భక్తులతో కిటకిటలాడింది. అర్చకులు స్వామి వారి మూల విరాట్‌కు తెల్లవారు జామున సుప్రభాతసేవ, మహామంగళహారతి, పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించి ఫలపుష్పాలతో అలంకరించారు. కొందరు భక్తులు మొక్కు చెల్లింపులో భాగంగా ఆలయంలో ప్రత్యేక అభిషేకాలను చేశారు. పిండి వంటలు వండి స్వామికి నైవేద్యంగా సమర్పించారు.

ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలి


కొనసాగుతున్న ఇళ్ల నిర్మాణ పనులు

ఆదోని సెంట్రల్: ఆదోని పట్టణంలోని జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని హౌసింగ్ ఈఈ రవికుమార్ సోమవారం ఇళ్ల నిర్మాణ పనులు చేస్తున్న థర్డ్ పార్టీ వారికి సూచించారు. మొదటి విడతలో 5,101 ఇళ్లు మంజూరు కాగా ఇప్పటి వరకు 394 ఇళ్లకు అర్‌సీ వేయగా 65 అర్‌సీ లెవల్‌లో ఉన్నాయని తెలిపారు. 66 గృహాలు లెంటల్ లెవల్‌లో, 3,527 ఇళ్లు బేస్ మట్టం లెవల్‌లోను ఉన్నట్లు వెల్లడించారు. 378 ఇళ్లు ప్లింత్ భీమ్‌లోను, 671 ఇళ్లు పిల్లర్స్ మరియు కాలమ్స్‌లో ఉన్నట్లు తెలిపారు. పనుల్లో ఆలస్యం చేయకుండా త్వరగా పనులను చేపట్టాలని సూచించారు.

బీసీల కల సాకారం


మాట్లాడుతున్న బీసీ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దస్తగిరినాయుడు

ఆదోనిటౌన్ : బీసీల కులగణనకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో బీసీల ఎన్నోఏళ్ల నాటి కల సాకారం అయ్యిందని బీసీ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దస్తగిరినాయుడు అన్నారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో రౌండ్‌టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. కులగణన చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ముందుకు రావడం హర్షణీయమన్నారు. నవంబర్ 15 నుంచి బీసీల కులగణన చేపట్టేందుకు నిర్ణయం తీసుకున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి బీసీలు రుణపడి ఉంటారన్నారు. సమావేశంలో బీసీ ఫెడరేషన్ నాయకులు వీరేష్, రఘురామ్, రాముడు, కపటి వీరభద్ర, సోమశేఖర్, నీలకంఠ తదితరులు పాల్గొన్నారు.

విచారణ జరిపించాలి

ఆదోని అర్బన్ : పట్టణంలోని మండిగిరి సర్వే నంబర్ 352లోనున్న ప్లాట్ల విషయంలో జరిగిన అవకతవకలపై విచారణ జరిపించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కునిగిరి నీలకంఠ కోరారు. సోమవారం ఆయన మాట్లాడుతూ మీడియాలో ప్లాట్ల విషయంలో అవకతవకలు జరిగాయనే ప్రచారం జరుగుతోందని, తాము జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని చెప్పారు.

బోరు ఏర్పాటు


చిన్నతుంబళంలో బోరు వేస్తున్న దృశ్యం

పెద్దకడబూరు : మండలంలోని చిన్నతుంబళం గ్రామంలో ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి రూ.లక్ష సొంత నిధులతో సోమవారం బోరు వేయించారు. గత నెలలో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నట్లు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన ఆయన సొంత నిధులతో బోరు వేయించడంతో గ్రామస్తులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

టీబీ డ్యాంలో 45 టీఎంసీల నీరు

హొళగుంద: కర్ణాటక రాష్ట్రం హోస్పేట్ వద్ద నిర్మించిన తుంగభద్ర జలాశయంలో నీటి నిల్వ సోమవారం 45 టీఎంసీలకు తగ్గింది. 1613.50 అడుగుల వద్ద నీటి మట్టం ఉండగా ఇన్‌ఫ్లో 749, ఔట్‌ఫ్లో 9,358 క్యూసెక్కులుంది. కాలువకు వదులుతున్న నీటితో పాటు ఆవిరి రూపంలో వారానికి 6 టీఎంసీల నీరు ఖర్చయ్యాయి. తుంగభద్ర దిగువ కాలువ (ఎల్లెల్సీ)కి సంబంధించి ఆంధ్రాలో కాలువ ప్రారంభం 250 కి.మీ వద్ద 493 క్యూసెక్కుల నీరు ప్రవహిస్తోంది. గతేడాది ఇదే సమయానికి డ్యాం పూర్తి సామర్థ్యం 1633 అడుగులతో 105.788 టీఎంసీల నీరు నిల్వ ఉండేవి. ఈ ఏడాది వర్షాభావం కారణంగా డ్యాం నిండక పోగా రోజురోజుకు నీటిమట్టం వేగంగా తగ్గుతోంది.


పెద్దతుంబళంలో ఏర్పాటు చేసిన శిబిరంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ గీతావాణి


ఓపీ నమోదు చేయించుకుంటున్న ప్రజలు


బీపీ పరీక్షిస్తున్న వైద్యురాలు

ప్రజారోగ్య రక్షణకే 'జగనన్న ఆరోగ్య సురక్ష'

● ఎస్సీ కమిషన్ ఛైర్మన్ విక్టర్ ప్రసాద్

కౌతాళం: ప్రజారోగ్య రక్షణ కోసమే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారని ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్‌ప్రసాద్, ఏరిగేరి గ్రామ సర్పంచ్ గోవిందు పేర్కొన్నారు. మండలంలోని ఏరిగేరి గ్రామంలో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న విక్టర్‌ప్రసాద్ మాట్లాడుతూ ప్రజలంతా ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతోనే ప్రతి ఇంటికీ వెళ్లి అనారోగ్యంతో బాధపడుతున్న వారిని గుర్తించి స్థానికంగా వైద్య శిబిరం ఏర్పాటు చేసి వైద్యసేవలు అందించి మందులు పంపిణీ చేయడం, పరిస్థితి విషమంగా ఉన్నవారిని ఆరోగ్యశ్రీ ఆసుపత్రులకు తరలించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పౌష్టికాహార స్టాల్ ఏర్పాటు చేశారు. జగనన్న కంటి వెలుగు పథకం కింద కంటి పలువురికి అద్దాలను పంపిణీ చేశారు.


'ఆయుష్మాన్' కార్డులు పంపిణీ చేస్తున్న విక్టర్ ప్రసాద్


కార్యక్రమానికి హాజరైన ప్రజలు

కార్యక్రమంలో తహసీల్దార్ రామేశ్వర్‌రెడ్డి, ఎంపీడీఓ సుబ్బారాజు, డాక్టర్ ఇమ్మానుయేల్, మనోజ్ కుమార్, శిరీష, కార్యదర్శి యోగేశ్వర్‌రెడ్డి, నాయకులు నీలకొంఠరెడ్డి, కౌతాళం మాజీ సర్పంచ్ అవతారం పాల్గొన్నారు.

ఆదోనిరూరల్ : ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజల ఇంటి ముంగిటకే వైద్యసేవలు అందేలా చర్యలు తీసుకుందని, సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ గీతావాణి కోరారు. సోమవారం పెద్దతుంబళం గ్రామంలో సర్పంచ్ వి.ఉచ్చప్ప, ఎంపీటీసీ మంచాల మౌలాసాబ్ ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ సత్యవతి, నీలోఫర్, ఇమ్రాన్, జుబేరియా, మయూర్‌కుమార్, సురేష్ పాల్గొని వెయ్యి మందికి పైగా రోగులను పరీక్షించారు. అనంతరం అంగన్‌వాడీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాళ్లను ఎంపీడీఓ పరిశీలించారు. అనంతరం కంటి సమస్యలతో బాధపడుతున్న రోగులకు అద్దాలను ఉచితంగా పంపిణీ చేశారు. పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్, ఎంపీహెచ్‌ఓ లక్ష్మీనారాయణ, సీహెచ్‌ఓ కస్తూరిబాయి, నాయకులు కాంట్రాక్టర్ బసవరాజు, హనుమంతరెడ్డి, నరసయ్య, నాగరాజు, ఈరన్న పాల్గొన్నారు.

ప్రజారోగ్యంపై నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు

ఆలూరు: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష వైద్య శిబిరాల నిర్వహణ, ప్రజారోగ్యంపై నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తప్పవని డీఎంహెచ్‌ఓ డాక్టర్ రామగిడ్డయ్య సిబ్బందిని హెచ్చరించారు. స్థానిక సచివాలయం–2లో సోమవారం జగనన్న సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. అక్కడ రోగులకు వైద్య సిబ్బంది అందిస్తున్న సేవలు, మందులు, ఆరోగ్య పరీక్షలను ఆయన పరిశీలించారు. అనంతరం డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ.. సురక్ష వైద్య శిబిరాల నిర్వహణలో నిర్లక్ష్యం పనికిరాదని, ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలని సూచించారు. వివిధ పీహెచ్‌సీల వైద్యులు, హెల్త్ సిబ్బంది ఉన్నారు.

సైన్స్ ల్యాబ్ ఏర్పాటు

ఎమ్మిగనూరు: స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో సైన్స్ ల్యాబ్ ఏర్పాటుకు ముంబైకి చెందిన యునైటెడ్ వే ప్రగతి సంస్థ రూ.7.5 లక్షలు మంజూరు చేసింది. బాలిక విద్యను ప్రోత్సహిస్తూ, వారిలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు, సైన్స్ టెంపర్‌మెంట్, సబ్జెక్టుల పట్ల ఆసక్తిని పెంచేందుకు సైన్స్ ల్యాబ్ దోహదపడుతోందని ఆ సంస్థ ప్రతినిధి స్వరూపరాణి పేర్కొన్నారు. ప్రాజెక్టు ప్రగతి సెంటర్‌ను కూడా గాంధీనగర్‌లో ఏర్పాటు చేసినట్లు ఆమె తెలిపారు. 12 –18 ఏళ్ల వయస్సు గల బాలికలు ఈ సెంటర్‌లో సైన్స్, మ్యాథ్స్, లైఫ్ స్కిల్‌లో ఉచితంగా శిక్షణ పొందవచ్చన్నారు. శిక్షణ కాలంలో అర్హులైన పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు మంజూరు చేస్తారని తెలిపారు.

స్పందన సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

ఆదోని రూరల్: స్పందన కార్యక్రమంలో ప్రజలనుంచి వచ్చిన వినతులను తక్షణమే పరిష్కరించాలని , ఏ ఒక్క అధికారి నిర్లక్ష్యం చేయకుండా అర్జీదారులను సంతృప్తి పరిచేలా చూడాలని ఆదోని సబ్‌కలెక్టర్ కార్యాలయ పరిపాలనాధికారి గోవింద్‌సింగ్ సూచించారు. సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో స్పందన కార్యక్రమంలో పాల్గొని డివిజన్‌లోని ఆయా మండలాల ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ వేణుసూర్య, గృహ నిర్మాణశాఖ డిప్యూటీ ఇంజినీర్ రవికుమార్, ఆర్టీసీ డిపో మేనేజర్ మహ్మద్‌రఫీ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు


స్పందన కార్యక్రమంలో ప్రజల సమస్యలను వింటున్న పరిపాలనాధికారి గోవింద్‌సింగ్

సమస్యల్లో కొన్ని..

● గోనెగండ్లకు చెందిన అక్బర్‌బీకి సర్వే నంబర్ 629/2లో 3.1 ఎకరాల భూమి ఉండగా ఆన్‌లైన్‌లో 2.95 ఎకరాలు మాత్రమే నమోదైందని, మిగిలిన 8 సెంట్లు నమోదు చేయాలని అర్జీ అందజేశారు.

● నందవరం మండలం మాచాపురం గ్రామానికి చెందిన బోయ చిన్నలక్ష్మి..తనకు ఇంటి స్థలం మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.

● ఎమ్మిగనూరు పట్టణం ముగతిపేటకు చెందిన షేక్ నజీర్‌కు ఎమ్మిగనూరు మండలం సర్దార్‌పురం గ్రామంల్లో సర్వే నంబర్ 27లో 6.45 ఎకరాల భూమి పెద్దల నుంచి సంక్రమించిందని, ప్రస్తుతం ఆ భూమి ఆక్రమణకు గురైందని విచారణ చేసి న్యాయం చేయాలని అర్జీ సమర్పించారు.

● ఆదోని మండలం గణేకల్ గ్రామానికి చెందిన బోయ నారాయణరెడ్డికి సర్వేనంబర్ 1సీలో 99 సెంట్లు, 1డీ లో 44 సెంట్ల భూమి ఉండగా, ఆన్‌లైన్‌లో 99 సెంట్లు మాత్రమే ఉందని, మిగిలిన 44 సెంట్లను నమోదు చేయాలని విన్నవించారు.

ట్రాక్టర్ ట్రాలీ బోల్తా.. ఇద్దరికి తీవ్ర గాయాలు

హొళగుంద: హొళగుంద శివారులోని ఆదోని రోడ్డులో సోమవారం జరిగిన ట్రాక్టర్ ప్రమాదంలో వందవాగిలి గ్రామానికి చెందిన ఇద్దరికి తీవ్ర గాయాలు కాగా అందులో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. వందవాగిలికి చెందిన ట్రాక్టర్‌లో సిమెంట్ బ్రిక్స్, సిమెంట్ బస్తాలు వేసుకుని హొళగుంద నుంచి వందవాగిలికి వెళ్తుండగా హొళగుంద శివారులో ట్రాక్టర్ ట్రాలీ అదుపు తప్పి బోల్తా పడింది. అందులో కూర్చున్న శివప్ప, పదేళ్ల బాలుడు విజయ్‌కి తీవ్ర గాయాలయ్యాయి. బాలుడి చెయ్యి విరిగి, పండ్లు ఊడి, మొహంపై తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 సిబ్బంది క్షతగాత్రులను హొళగుంద పీహెచ్‌సీకి తరలించగా డాక్టర్ బింధుమాధవి ప్రాథమిక చేశారు. బాలుడి పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం ఆదోనికి రెఫర్ చేశారు.



గాయపడిన శివప్ప, ఆదోని రోడ్డులో బోల్తా పడిన ట్రాక్టర్ ట్రాలీ

గ్రామీణ రహదారులకు మహర్దశ

ఆదోనిరూరల్ : గ్రామీణ ప్రాంతాల రహదారులకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మహర్దశ వచ్చిందని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని మాంత్రికి గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఆయన మాట్లాడుతూ..ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేకంగా ఐ ఇంపాక్ట్ రోడ్డు పథకం కింద రూ.2.60 కోట్లు మంజూరు చేశారన్నారు. కపటి–పెద్దతుంబళం వరకు 13 కి.మీ. రోడ్డు పనులు చేపట్టడం జరిగిందన్నారు. ఇందులో పెసలబండ, మాంత్రికి గ్రామాల్లో దాదాపు 270 మీటర్ల చొప్పున సీసీ రోడ్లు, బీటీ రోడ్డు వేస్తారని, త్వరితగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, పార్టీ సీనియర్ నాయకులు నరసింహమూర్తి, రామలింగేశ్వరయాదవ్, సర్పంచ్ బసవరాజు, కాంట్రాక్టర్ బలరామ్‌చౌదరి, ఆర్‌అండ్‌బీ ఏఈ రవికాంత్ పాల్గొన్నారు.


మాంత్రికిలో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

జగనన్న కాలనీలో నీటి వసతి ఏర్పాటు

కోసిగి:స్థానిక ఏపీ మోడల్ స్కూల్ సమీపంలో ఏర్పాటైన జగనన్న కాలనీలో నీటి వసతి కల్పించినట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మల్లికార్జునరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకుడు రాజేష్ తెలిపారు. సోమవారం సర్పంచ్ అయ్యమ్మ సమక్షంలో కొత్తగా ఏర్పాటు చేసి బోరుకు కొత్త మోటార్‌ను అమర్చి తాగునీటి సరఫరా ప్రారంభించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మా ట్లాడుతూ జగనన్న కాలనీల్లో అన్ని వసతులు కల్పించామన్నారు. కోసిగిలోని కాలనీలో 7 బోర్లు వేయించామని, 30 మినీ గుమ్మీలు ఏర్పాటు చేసి తాగునీ టిని సరఫరా చేయిస్తున్నామని వివరించారు. బుడగజంగాల సంఘం తాలుకా అధ్యక్షుడు అయ్యప్ప పాల్గొన్నారు.


బోరును ప్రారంభిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మల్లికార్జున రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు

నేడు జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల షెడ్యూల్

ఆదోని సెంట్రల్: ప్రతి ఒక్కరికి సంపూర్ణ ఆరోగ్యం కలగ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం చేపట్టింది. వలంటరీల ద్వారా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ప్రతి గ్రామ, వారు సచివాలయాలకు చెందిన ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు ఇంటింటికి వెళ్లి వైద్య పరీక్షలను నిర్వహిస్తున్నారు. దీర్ఘ కాలిక వ్యాదులు, అనారోగ్య సమస్యలు కలిగిన వారిని గుర్తించి వారి వివరాలను మోబైల్ యాప్‌లో నమోదు చేస్తున్నారు. మంగళవారం ఆదోని, మంత్రాలయం నియోజకవర్గాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల షెడ్యూల్‌ను అధికారులు విడుదల చేశారు.

మండలం	గ్రామం	ప్రదేశం	డాక్టరు
ఆదోని పట్టణం	శంకర్‌నగర్, హవ్వన్నపేట	వైఎస్‌అర్ నగర్, కునిమోహల్లా	బి. హర్షిక
ఆదోని	దిబ్బనకల్లు	గ్రామ సచివాలయం	బి. ఇబ్రహీమ్
కోసిగి	కందుకూర్	ప్రభుత్వ ఉన్నత పాఠశాల	పి.అభిరూప్
కౌతాళం	సులికేరి	గ్రామ సచివాలయం	పావనీ సీలమ్
మంత్రాలయం	సుంకేశ్వరి	గ్రామ సచివాలయం	బి.సురేష్


రాజరాజేశ్వరి అలంకారంలో ఫారెస్ట్‌లైన్ అంబాభవానీమాత


షరాఫ్‌బజార్‌లో బాలాత్రిపురసుందరీగా మహంకాళిదేవి


ఎంఎం కాలనీలో బాలాత్రిపుర సుందరిగా పరమేశ్వరిదేవి


బిల్వపత్రి అలంకారంలో పేట వీరభద్రేశ్వరస్వామి

బాలాత్రిపుర సుందరిగా పరమేశ్వరిదేవి

ఆదోనిఅర్బన్ : పట్టణంలోని దసరా శరన్నవరాత్రోత్సవాలు రెండోరోజూ సోమవారం అత్యంత వైభవంగా జరిగాయి. ఆయా ఆలయాలు, మండప నిర్వాహకులు అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే కుంకుమార్చన, బిల్వార్చన, సామూహిక వ్రతాలు చేపట్టారు. సాయంత్రం అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు.

మంత్రాలయం: దేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు సోమవారం వాసవి సేవా సంఘం కల్యాణ మండపంలో కొలువుదీరిన దుర్గామాత అమ్మవారు గాయత్రి దేవిగా దర్శనమిచ్చారు. అధ్యక్షుడు నారాయణశెట్టి ఆధ్వర్యంలో గౌతమ్‌స్వామి నేతృత్వంలో సూరి దంపతులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. గ్రామ దేవత మంచాలమ్మ సౌభాగ్యలక్ష్మి అలంకరణలో భక్తులకు దర్శనమివ్వగా పీఠాధిపతి శ్రీ సుభుధేంద్రతీర్థులు ప్రత్యేక పూజలు చేపట్టారు.


కోసిగి:కందుకూరు గ్రామంలో వెలసిన శాంభవి దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రెండవ రోజు బ్రహ్మచారిణిగా దర్శనమిచ్చారు. సోమవారం ఆలయంలో వేకువ జామునుంచి అర్చకులు మల్లికార్జున స్వామి ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకాలు చేపట్టారు.

కౌతాళం: దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం స్థానిక చౌడేశ్వరిదేవి ఆలయంలో, ఈరన్న కట్టవద్ద ఉన్న మహంకాళి దేవి దేవాలయంలో అ మ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు.

పెద్దకడబూరు : దసరా నవరాత్రి ఉత్సవాల్లో బాగంగా సోమవారం మండలంలోని దొడ్డిమేకల గ్రామంలో పార్వతీదేవి అమ్మవారు గాయిత్రీదేవిగా దర్శనమిచ్చారు. అలాగే మండల కేంద్రంలో కాళికాదేవి అమ్మవారు శైలపుత్రిదేవిగా దర్శనమిచ్చారు.


వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఉత్సవ విగ్రహానికి శివలింగ అలంకార దృశ్యం


వెన్న అలంకారంలో నగరేశ్వరస్వామి ఆలయంలో వెలిసిన వాసవీమాత


మంత్రాలంలో గాయత్రీ దేవి అలంకరణలో వాసవీమాత


మంత్రాలంలో సౌభాగ్యలక్ష్మి అలంకరణలో మంచాలమ్మ


కందుకూరులో బ్రహ్మచారిణి దేవిగా శాంభవి దేవి


కౌతాళంలో పూజలందుకుంటున్న అమ్మవారు


పెద్దకడుబూరులో గాయత్రీ దేవిగా పార్వతీదేవి

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక


మాధవి

ఆలూరు: స్థానిక హత్తిబెళగళ్ గ్రామ రోడ్డు సమీపంలోని గిరిజన గురుకుల బాలికల పాఠశాలలో పదో తరగతి చదువుతున్న బి.మాధవి ఈ నెల 12న కర్నూల్లో జరిగిన టెన్నికాయిట్ క్రీడలో ప్రతిభ చాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికై ంది. జిల్లా స్కూల్స్ అండ్ గేమ్స్ ఫెడరేషన్ అథారిటీ సెలక్షన్ కమిటీ సభ్యులు ఆమెను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. అదేవిధంగా ఈ పాఠశాల నుంచి పి.రేణుక వాలీబాల్, శాంతిబాయ్ హ్యాండ్‌బాల్, శ్రీలత ఖోఖోలో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ షాహనూరు సోమవారం తెలిపారు. వీరందరూ వచ్చే నెలలో ఏలూరులో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని వెల్లడించారు.

అన్న చేతిలో తమ్ముడి హతం


మృతి చెందిన జే.చిన్నఆనంద్

కృష్ణగిరి: పనికి వెళ్లడం లేదని అన్నదమ్ముల మధ్య జరిగిన గొడవలో తమ్ముడు మృతి చెందిన ఘటన కృష్ణగిరి మండల పరిధిలోని టి.గోకులపాడులో సోమవారం రాత్రి జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన జరదొడ్డి యేసయ్య, అనురాధ దంపతులకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు పెద్ద ఆనంద్ వెల్దుర్తిలోని ఓ హోటల్‌లో పని చేస్తున్నాడు. రోజూ ఇంటి నుంచి వెళ్లి తిరిగివచ్చేవాడు. చిన్న కుమారుడు చిన్న ఆనంద్ (21) గ్రామంలో అప్పుడప్పుడు పనికి వెళ్లేవాడు. సోమవారం రాత్రి అన్న పనికి ఎందుకు వెళ్లడం లేదని తమ్ముడిని ప్రశ్నించగా మాట మాట పెరిగింది. ఆగ్రహంతో తమ్ముడి గొంతు నొక్కి పట్టుకోవడంతో ఊపిరి అందక కుప్పకూలిపోయాడు. ఇరుగుపొరుగు వారు వెంటనే 108 అంబులెన్స్ ద్వారా వెల్దుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గంమధ్యలో చిన్న ఆనంద్ మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ సురేష్ గ్రామానికి చేరుకుని విచారణ చేపట్టారు.

హైవే పనులు ప్రారంభించాలి

ఆలూరు: ఆదోని నియోజకవర్గం నుంచి ఆలూరు మీదుగా కర్ణాటక రాష్ట్రంలోని బళ్లారి వరకు నిర్మిస్తున్న నేషనల్ హైవే– 167 పనులను త్వరితగతిన పూర్తి చేయించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సృజనను సీపీఎం నాయకులు కోరారు. ఆమె సోమవారం హొళగుంద మండలం దేవరగట్టు మాళమల్లేశ్వర స్వామి ఉత్సవాల నిర్వహణపై అధికారుల సమీక్ష నిర్వహించేందుకు వెళుతూ స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహానికి వచ్చారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు నారాయణస్వామి, మండల కార్యదర్శి షాకీర్, ఈరన్న తదితరులు గత నాలుగేళ్లుగా రోడ్డు పనులు అసంపూర్తిగా నిలిచిపోవడంతో ఎదురవుతున్న ఇబ్బందులను వివరించారు. రోడ్డు నిర్మాణ పనులు వేగవంతం చేయాలని కోరారు.


జిల్లా కలెక్టర్ డాక్టర్ సృజనకు వినతి పత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

ఎన్‌ఐఏ సోదాలు సరికాదు

ఆదోనిరూరల్ : గాంధీజయంతి రోజున జిల్లాలో అనేక సంఘాలతో పాటు, మానవహక్కుల వేదిక బాధ్యులను విచారణ, సోదాల పేరుతో ఎన్‌ఐఏ ఆకస్మిక దాడులు చేయడం సరికాదని మానహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షు ఢిజీ యు.జి. శ్రీనివాసులు, రాయలసీమ కో ఆర్డినేషన్ సమితి నాయకుడు జి.రాజు అన్నారు. సోమవారం స్థానిక ఆర్‌సీసీ కార్యాలయంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ జాతీయ దర్యాప్తు సంస్థ మూడేళ్ల క్రితం విశాఖ జిల్లాలో నమోదైన ఒక కేసు నిమిత్తం విచారణ పేరుతో వచ్చి పలువురి ఇళ్లల్లో సోదాలు జరపడం బాధకరమన్నారు. ఒకవైపు నేర విచారణ ప్రక్రియ సెక్షన్ 160 కింద వారిని సాక్షులుగా విచారిస్తున్నామని చెబుతూనే మరోవైపు వారిని అనుమానితులుగా భావిస్తున్నామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు, ఏపీటీఎఫ్, రైతు కూలీ సంఘం, ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం, అఖిలభారత కార్మిక సంఘాల సమాఖ్య, ప్రగతిశీల విద్యార్థి సంఘం , భారతకార్మిక సంఘాల సమాఖ్య, ఆదోని ప్రాంత అభివృద్ధి సంఘం నాయకులు హాజరయ్యారు.

ఈవ్‌టీజింగ్ నిర్మూలనపై అవగాహన

పత్తికొండ రూరల్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కేపీఆర్ మైత్రి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో సోమవారం ఈవ్‌టీజింగ్ నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు రామ్మోహన్ అధ్యక్షతన జరిగిన సదస్సుకు రూరల్ సీఐ ప్రవీణ్‌కుమార్ రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ మాధురి ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడారు. చెడు వ్యసనాలకు బానిసై జీవితాలు పాడు చేసుకోవద్దన్నారు. ఈవ్‌టీజింగ్‌కు విద్యార్థులు దూరంగా ఉండాలన్నారు. విద్యార్థులు స్నేహపూర్వకంగా ఉంటూ సత్ప్రవర్తన కలిగి ఉండాలన్నారు. వైస్ ప్రిన్సిపాల్‌సుబ్బయ్య,అధ్యాపకులు పాల్గొన్నారు.

నూతన తహసీల్దార్ కార్యాలయం ప్రారంభం

దేవనకొండ: మండల కేంద్రంలో నూతన తహసీల్దార్ కార్యాలయాన్ని సోమవారం ఎమ్మార్వో వెంకటేష్‌నాయక్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో తహసీల్దార్ కార్యాలయ భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో పైపెచ్చులు ఊడి పడుతుండేవని చెప్పారు. జిల్లా అధికారులకు ఈ విషయాన్ని తెలపగా ఖాళీగా ఉన్న పొదుపు భవనంలో తహసీల్దార్ కార్యాలయం భవనంగా మార్చుకునేందుకు అవకాశం కల్పించారన్నారు. ఇందులో భాగంగానే తహసీల్దార్ కార్యాలయాన్ని ప్రారంభించినట్లు చెప్పారు. సోమవారం నుంచి రెవెన్యూ సేవలన్నీ ఈ భవనం నుంచే చేపడతామని, ప్రజలు గమనించాలని కోరారు.